
శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీ కీ జై!

# గురుకృప

అనుగ్రహ పుష్కరం



## జన్మదిన సంచిక



గురుసన్నిధిలో అతడు చేయవలసినదేది ఉండదు. గురువెప్పుడూ ఏదీ బోధించరు.
తమ శక్తిని ప్రసరింపజేస్తారు. సంపూర్ణ శరణాగతి చెందిన ఆత్మ తనలో ప్రసరింపజేయబడిన
ఆ శక్తిని పూర్తిగా గ్రహించి, అహాన్ని కోల్పోయి పరిపూర్ణ లబ్ధిని పొందుతుంది.

- శ్రీసాయిభక్త అనుభవ సంహిత

సంపుటి : 13

# గురుకృప

సంచిక : 1



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీ బాబూజీ



## లోపలి పేజీలలో

అనుగ్రహ పుష్కరం - సద్గురు పద పుష్పం 4
- గురుకృప

అనుగ్రహ 'గిరి' - 'సిరి' 7
- బి. కొండయ్య

అనుగ్రహ తత్పరుడు.. 10
- రాణి

సద్గురు పదము (పథము) 11
- బీర్బల్ కథలు

దాసబోధ 13
- సాయిపథం నుంచి

అనుగ్రహమంటే?...అనుగ్రహముంటే?.. 17
- గురుకృప

నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు

GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01. Ph : 93933 61778
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Ph : 2740222



# అనుగ్రహ పుష్కరం - సద్గురు పద పుష్పం

శ్రీసాయిబాబా మనకుద్బోధించినది శరణాగతి పథం. సద్గురువుకు లేక దైవానికి సంపూర్ణంగా శరణాగతి చెందడమే – సాయిపథంలో మార్గం, గమ్యం కూడా! కుండపోతగా వర్షిస్తున్న సద్గురు అనుగ్రహానికి సాక్షిగా, సాకారంగా నిలుస్తోంది మీ చేతిలో ఉన్న ఈ 'గురుకృప' సంచిక. ఈ సంచిక ఒక మధురమైన అనుభూతికి, గురుబంధువులకు సద్గురుదేవుని పట్ల ఉన్న ప్రేమకు, ఋణానుబంధంతో సద్గురుపద సన్నిధిని చేరి తమ జీవితాలను ఆనందమయం చేసుకున్న ఎందరో గురుబంధువుల భక్తికి ప్రతిరూపం. ఇందులోని ప్రతీ అక్షరం సద్గురుపద సమర్పణం. **'గురుకృప' పత్రిక ప్రారంభమై పన్నెండు సంవత్సరాలయింది.** పన్నెండు వసంతాలు క్రమం తప్పకుండా, సకాలంలో **పత్రిక గురుబంధువులకు చేరిందంటే అది కేవలం – సద్గురు అనుగ్రహ విశేషమే!** పత్రిక ప్రారంభమయిన నాటినుండి నేటికీ కొంత నవీనతను, నవ్యతను సమకూర్చుకుందటే అది **సద్గురు ఆశీః ఫలితమే!** ఇందు ఎవ్వరి యత్నమూ లేదు, మరెవ్వరి చిత్తమూ లేదు.

### *ఎలా సాధ్యమయ్యింది?*

గురుబంధువుల అనుభవాలు, సద్గురు చరణదాసుల అనుభూతులు, వారికి శ్రీబాబూజీతో ఉన్న బంధం, సద్గురుపథానికి చుక్కానిగా సాగిన కొందరు భక్తుల జీవితాలు, మహాత్ముల, సత్యద్రష్టల బోధలు, వారి ఆచరణాత్మక జీవన విధానము..... ఇలా 'గురుకృప' పంచాలనుకున్నది కేవలం సద్గురు శరణాగతి పథంలోని కొన్ని ఆణిముత్యాలనే! పూజ్య శ్రీబాబూజీ అనుగ్రహంతో ఇలా ప్రతి విషయం సవ్యంగా, సమున్నతంగా సాగిందన్న భావం మదిలో ఉంది కానీ, అందుకు ఒక నిర్దిష్టమైన, స్పష్టమైన అవగాహన ఈ సంఘటనతో వచ్చింది. కాకతాళీయంగా అన్పించినా, ఒకరోజు రైల్లో ప్రయాణిస్తూ, బాబా చరిత్ర చదువుకుంటుంటే ప్రక్కన కూర్చున్న అతను గమనిస్తూ కొంతసేపు ఆగి గురువుగారి గురించి మాట్లాడటం మొదలుపెట్టాడు. పూజ్య బాబూజీ చిన్ననాటి స్నేహితుడట. ఆయన ఇలా అన్నారు ***"శరత్ గొప్పతనం ఏమిటంటే తను సాయిభక్తులందరిని ఒక చోటుకి చేర్చాడు"*** అని. అనన్య సాయి ప్రేమికుల పథం సాయిపథం, ఆనందపథం, ప్రగతి పథం, ఆదర్శపథం. శ్రీసాయినాథుడు మనపై అపార ప్రేమతో, కరుణతో చూపిన సద్గురుపథం... ఇలా ***సాయిభక్తుల ప్రేమ అక్షరరూపమయ్యింది, సాయికి సభక్తి పూర్వకంగా – బాబూజీ బిడ్డలు సమర్పించిన గురుచరణ కుసుమమయ్యింది 'గురుకృప'.***





## మరో 'పత్రిక' అంతే కదా!

అవును! కేవలం పేజీల పరిమాణంతో, కాలక్రమంలో త్రైమాసికంగా ఒక సంపుటిగానే, అనుకుంటే, 'గురుకృప' ఒక పత్రిక మాత్రమే! ***నిజానికి ఈ చిరుపత్రిక, 'గురు' పత్రిక, సాయి మానసపుత్రిక!*** శ్రీసాయి ఆవిష్కరించిన సద్గురుపథంలో పయనిస్తూ- సద్గురువునే దైవంగా, ధర్మంగా, మార్గంగా, గమ్యంగా స్వీకరించి, చరించే జీవులకు ఒక చల్లని తెమ్మెర, 'గురుకృప' పత్రిక. చాలా పరిమితమైన పరిధిని కలిగి ఉందన్న భావనలో సందేహం లేదు. అయితే 'గురుకృప'లో ప్రచురించే ప్రతీ వ్యాసం, అనుభవం, అనుభూతి మనలను మన 'గురువు'కు దగ్గర చేసేదిగా ఉందా?లేదా? అన్నదే ప్రశ్న. ఎందుకంటే 'గురుకృప' కు ఉన్న ఒకే ఒక్క ఆదర్శం - ఇదిగో **శ్రీసాయి చెప్పిన మాటలే! "గురువు యొక్క మహాత్మ్యాన్ని తెలుసుకొని, ఆయనే దైవమని భావించే వారు ధన్యులు"** ఏ ఒక్క సాయిభక్తుని మదిలో అయినా సద్గురు శరణాగతి పథం వైపుగా ఒక చిన్న తలంపు రాగలిగినా 'గురుకృప' పత్రిక సార్ధకమయినట్లే! సంపూర్ణ సద్గురు అనుగ్రహ ప్రాప్తి కలిగినట్లే! మరొక కోణం ఏమిటంటే 'గురుకృప' ఒక చక్కటి చరిత్రకు వేదిక, సాయి తన బిడ్డలకిచ్చిన 'కానుక'. సాయి సత్సంప్రదాయాన్ని, అసలైన సాయిమార్గాన్ని, ఈ జగత్తుకు అందించిన పూజ్యులు, తంతుల తంత్రంలో తల్లడిల్లిపోతున్న ***బిడ్డలకు భక్తి-జ్ఞానాలను 'ఉగ్గు'గా పట్టి తీర్చిదిద్దుతున్న తల్లి-తండ్రి శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ చరణ కమలాలకు ఒక వినయపూర్వక సమర్పణం - గురుకృప.*** అంతటా తానై, అన్నిటా తానై మనలను సాయిమాయివైపుగా చేయిపట్టి నడిపిస్తున్న ఆ మహితాత్ముని పట్ల ఉన్న ప్రేమను వ్యక్తం చేసుకునేందుకు శ్రీ సాయి చేసిన ఏర్పాటు 'గురుకృప'!

## ఏమిటి ప్రయోజనం?

నిజమే! పుష్కరకాలం పత్రిక వచ్చింది. ఎవరికి ప్రయోజనం ఈ పత్రిక వల్ల! "పౌరసత్వం గురించి ఉద్గ్రంథం రాస్తాడు ఒకాయన, కానీ పౌరునిగా ప్రవర్తించడు. 'న్యాయ' కోవిదుడు కానీ, ఎప్పుడూ అన్యాయంగా ప్రవర్తిస్తాడు ఒకాయన. తత్త్వం గురించి లెక్కలేనంత జ్ఞానం ఉంది కానీ తాత్త్విక చింతన మాత్రం అలవచుకోలేదు ఒకాయన. ఇలా 'తెలుసుకున్నందు' వల్ల ఏం ప్రయోజనం, అది 'ఆచరణ'కు నోచుకుంటేనే అర్థం, పరమార్థం" అంటారు స్వామి రంగనాధానంద. సమున్నతమైన సద్గురుపథంవైపుగా, మనం వేసే ఆచరణాత్మకమైన ఒక్క అడుగు మనలను తప్పక తరింపచేస్తుంది. అలాంటి అడుగులు పడిన నాడు 'గురుకృప' పత్రికకు ప్రయోజనం చేకూరినట్లే. శ్రీసాయిని త్రికరణశుద్ధిగా మనం వేడుకునేది కూడా అదే! తండ్రికి తగ్గ బిడ్డలుగా పరిణితి చెందాలని! సద్గురు చరణాలను చేరిన ప్రతీ జీవి సాయి చూపిన బాటలో నియమబద్ధమైన జీవనాన్ని, సత్సాంగత్యాన్ని, సద్గ్రంథాలను, గురుస్మరణను, గురుచరణాలను ఆశ్రయించుకొని 'గురువే దైవమని' తెలుసుకున్న నాడు 'గురుకృప' పత్రికకు ప్రయోజనం చేకూరినట్లే!





ఆ లక్ష్యాన్ని చేరుకునే వరకు ఈ మననం ఇలాగే సాగాలని, ఆ యజ్ఞంలో ఎవరి వంతు వారు అక్షర సమిధలను సమర్పించాలని ఆకాంక్షిస్తోంది గురుకృప.

**రాబోయే రోజుల్లో...**

'గురుకృప' కుండపోతగా వర్షిస్తూనే ఉంది. మనమే ఆ ఎరుకలో ఉండటం లేదు. గురువనే ఆ 'ఎరుక' ఎప్పుడూ నిలవలి, అందుకు మరింతగా గురు'స్మరణ' జరగాలి, గురు'మహిమ' తెలియాలి. గురు'కీర్తన' సాగాలి. గురుని 'భక్తిగా' కొలవాలి. అందుకు ప్రతీ గురుబంధువు మరొక గురుబంధువుకు ఊతమివ్వాలి. పంచుకుంటే పెరిగే ప్రేమను అందరికీ పంచి 'గురువు'కు మరింత దగ్గరవ్వాలి. 'గురుకృప'ను ఆస్వాదించగలగాలి.

ఇది ఎవరో కొద్దిమంది వ్యక్తులతో (గురుబంధువులతో) సాధ్యమయ్యేది కాదు. ప్రతి గురుబంధువు తమ 'పాత్ర'ను నిర్వహించాలి. "ఇదిగో ఇలా ముందుకెళ్తే మనం 'సద్గురువు'పరంగా ఒక్క అడుగు వేసే అవకాశం ఉంది, అని భావిస్తే" ఆ అంశాన్ని నలుగురితో పంచుకోవడం, సద్గురు శరణాగతిపథాన్ని ఒక ప్రేమోద్యమంలా, తన్మయత్వంతో, తపనతో ముందుకు తీసుకువెళ్లగలిగిననాడు మన జీవితాలకు ఒక రూపు వచ్చినట్లే. తనకు అవకాశం వచ్చినపుడల్లా నానాసాహెబ్ చందోర్కర్ 'సాయి'ని స్మరించుకునేవాడు. ఎందరో సాయిభక్తుల పరిపూర్ణ జీవితాలకు సాయి ఏర్పరచిన మిష 'నానా'. అగాధమైన సాయిచర్యల అవలోకనకు నాటి సాయిభక్తుల అనుభవాలే ఆధారం. అదే తీరున గురుబంధువుల్లారా! 'గురుకృప' పత్రిక సవినయంగా సాయిని వేడుకుంటోంది. సుమారు రెండు దశాబ్దాల కాలంగా పూజ్య గురుదేవుల చెంతకు చేరిన వారి నుంచి అసంఖ్యాకంగా నేటి వరకు చేరుతున్న ఎందరో గురుబంధువులు– వారి జీవితాలను శ్రీబాబూజీ తీర్చిదిద్దుతున్న తీరు, సాయిమయమవుతున్న వారి దైనందిన జీవనాలు – భావాలకందని వారి అనుభవాలు – మాటలతో పరిమితులు విధించలేని వారి అనుభూతులు, శ్రీబాబూజీ అనుగ్రహంతో ప్రతీ రంగంలో వారు సాధించిన ప్రగతి, పురోగతి, సాయిపట్ల తమ 'ప్రేమ'ను వ్యక్తం చేసుకోవడంలో శ్రీబాబూజీ తమ 'చేయి' పట్టుకు నడిపించిన తీరు ఇలా... ఇలా... ఏదైనా శ్రీబాబూజీకి సంబంధించిన ప్రతీ మాటకు అక్షరరూపమివ్వాలి.

అనంతమైన 'ప్రేమ' వ్యక్తం కావాలని అందుకు 'గురుకృప' పత్రిక ఒక చిన్న సద్గురుపద పుష్పమవ్వాలని ఆశిస్తోంది, ఆకాంక్షిస్తోంది. మీ అందరిలోను వ్యక్తమవుతున్న శ్రీసాయి ఈ కలను, ఆశను నెరవేరుస్తారని, మనందరి జీవితాలను సద్గురుమయం చేస్తారని ఆశిస్తూ..

**–గురుకృప**





# అనుగ్రహ 'గిరి' - 'సిరి'

పూజ్య శ్రీగురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీతో 1975లో నెల్లూరులో పరిచయమైనది. అది 1976లో సుమారు జూలై, ఆగస్టులలో దృఢపడింది. ఉద్యోగరీత్యా నేను వెంకటగిరి ప్రభుత్వ ఐటిఐలో జాయిన్ అయినాను. అచ్చటికి అంటే వెంకటగిరికి గురువుగారి నాన్నగారు శ్రీసురేంద్రబాబుగారు జెడ్.పి. హైస్కూల్ హెడ్‌మాస్టర్‌గా ట్రాన్స్‌ఫర్ అయినారు. ఒకరోజు నేను వెంకటగిరి బజారులో వెళ్లే సమయంలో శ్రీసురేంద్రబాబుగారు కన్పించారు. సార్ మీరు ఇక్కడ వున్నారేమిటి అని అడిగిన నాకు వారు నన్ను ఇచ్చటికి ట్రాన్స్‌ఫర్ చేసారు, ఇల్లుకూడా తీసుకున్నాను అంటూ బాబు కూడా వచ్చి వున్నాడు. ఒకసారి ఇంటికి రమ్మన్నారు. అలా వెంకటగిరిలో శ్రీబాబూజీని కలిసిన తరువాత ఒకరకంగా చెప్పాలంటే నా ఆధ్యాత్మిక జీవితం మొదలైనదని చెప్పవచ్చు. ప్రతిరోజు బాబూజీ, నేను వూరి బయటకు వెళ్లి ప్రశాంతమైన ప్రదేశంలో కూర్చొని మాట్లాడుకునేవాళ్లం. ఒకరోజు బాబూజీ శ్రీసాయిబాబాను గురించి చెప్తూ నీవు ఎవరిని పూజిస్తావు అని అడిగారు. మాకు శ్రీనరసింహస్వామి కులదైవం కాని నాకు శ్రీరాముడంటే ఇష్టం. అందువలన నేను రామనామం చేసుకుంటూ ఉంటాను, అని చెప్పాను. అప్పుడు వారు బాబాను పూజ చేసుకోరాదా అని అన్నారు. నాకు అప్పటికి సాయిబాబా గురించి మాత్రం ఏమీ తెలియదు. అయినా నెల్లూరులో పార్కు ప్రక్కన వున్న బాబా గుడికి ఎప్పుడైనా స్నేహితులతో వెళ్లి దర్శించుకునేవాడిని. అంతకుమించి నాకు వారి గురించి ఏమీ తెలియదు. బాబూజీ అలా అడిగేసరికి నాకు సాయిబాబా ద్వారకామాయిలో వున్న ఫొటో గుర్తుకు వచ్చి ఇలా అన్నాను. నాకు ఎందుకో బాబా అంటే ఇష్టం లేదు అని అన్నాను. వారు సరే అలానే కానీలే అని మాత్రం అన్నారు. శ్రీబాబూజీ వెంకటగిరిలో ఉన్నపుడు రోజు వారితో కలిసి సాయంకాలం గడిపేవాడిని. అదే సమయంలో నాకు మొదట జి.కె.తో తర్వాత సాయిప్రసాద్‌గారితోను పరిచయం అయినది. ఆ తర్వాత అనంతరామకృష్ణ పరిచయమైనారు. సహచరుడైన సంగం నారాయణరావుగారిని బాబూజీకి పరిచయం చేసాను. మేమందరం బాబుగారి వద్దకు చేరేవారం. వారు బాబా గురించి ఇంకా ఎన్నో విషయాలు చెపుతుంటే నేను ఎంతో ఆశ్చర్యపోయేవాడిని. వారికున్న పరిజ్ఞానాన్ని గురించి, అలా అదివొక సత్యంగా మార్చివేసారు బాబూజీ దానిని. అప్పుడే బాబుగారి ద్వారా మాకు శ్రీఎక్కిరాల భరద్వాజ మాస్టర్ గారితో పరిచయ భాగ్యం కలిగింది. ఒక గురువారం రోజు బాబూజీ గారి ఇంటికి వెళ్లాను. వారు యధాలాపంగా మాట్లాడుతూ బాబా ఫొటో ఒకటి ఇచ్చి పూజలో పెట్టుకో అని అన్నారు. వారి మాటలో ఏ మహత్యం ఉందోగాని, నేను మారు మాట్లాడకుండా ఆ ఫొటో తీసుకొని వెళ్లి ఆ రాత్రే కొట్టువాడిని బ్రతిమాలి ఫ్రేమ్ కట్టించుకొని ఇంటికి తీసుకుని వెళ్లి తలస్నానం చేసి బాబా ఫొటో పూజలో పెట్టి పూజ ప్రారంభించాను. ఆ





ఫొటో ఇప్పటికీ నా పూజలో వుంది. అలా బాబూజీ నన్ను ఒక సాయిభక్తునిగా చేసారు. అందుకు వారికి సదా కృతజ్ఞుడను. నాకు బాబూజీతో వున్న అనుభవాలను కొన్నింటిని మీతో పంచుకుంటాను. వెంకటగిరిలో వున్న రోజులలో బాబూజీ మాకు ఆచార్య భరద్వాజగారితో పరిచయం చేసారు కదా వారి రూపు నన్ను ఎంతో ముగ్ధుడ్ని చేసేది. వారు విద్యానగర్ (గూడూరు దగ్గర) నుండి వెంకటగిరికి తరచూ వస్తూ ఉండేవారు. వారు వచ్చే ప్రతిసారి బాబూజీ చాలా హంగామా చేసేవారు. తోరణాలు, బ్యానర్లు కట్టించేవారు. తరువాత రోజులలో వారి రాక పెరిగింది. అప్పుడూ బాబూజీ అలానే చేయించేవారు. నేను ఒకసారి వారిని ఇలా అడిగాను. బాబూజీ! మాస్టరుగారు ఎక్కువగా వస్తున్నారు కదా ప్రతీసారి ఇలా వారిని ఆహ్వానించాలా? అని. దానికి వారు చెప్పిన సమాధానం నన్ను ప్రాన్పడ చేసింది. “కొండయ్యా! ఒక్క విషయం గుర్తుంచుకో వారు నా గురువు. వారు వారానికి ఒక్కసారి కాదు, ప్రతిక్షణం వారు వచ్చినా నేను అలాగే వారిని ఆహ్వానిస్తాను” అన్నారు. అప్పటికి గురువు యొక్క ఆవశ్యకత గాని, వారిని అలా సేవించాలని కాని నాకు తెలియదు. ఆ మాటలు ఇప్పటికీ నా చెవులలో మార్మోగుతూనే ఉంటాయి.

బాబూజీతో నా అనుభవాలు ఎన్నో ఉన్నా ఒకటి రెండు ఇప్పుడు ప్రస్తావిస్తాను. నెల్లూరు బైపాస్‌రోడ్డులో ఉండే బాబా మందిరంలో నేను గురువు (బాబూజీ) గారి ఆదేశంతో ప్రతిరోజు సత్సంగం చేసేవాడిని. 1992 నుండి 2002 వరకు చేసాను. ఒక గురువారం రోజు సత్సంగం అయిన తర్వాత నా స్కూటర్‌లో ఇంటికి బయలుదేరాను. అప్పుడు నాతో కూడా నా మనుమరాలు ముక్తాబాయి, నా చిన్నకుమార్తె సాయిప్రసన్నలతో బయలుదేరాను. అచ్చటే వున్న నా మేనకోడలు అరుణ కూడా నేనూ వస్తానని స్కూటర్‌లో ఇరుకుగా కూర్చుంది. అలా మంచిలోడుతో బయలుదేరిన నాకు ఆత్మకూరు బస్టాండు సెంటరుకు వచ్చేసరికి ట్రాఫిక్ జామ్ అయి నేను రెండు లారీల మధ్య చిక్కుకుపోయాను. అలాగే బాబా ఏమిటి ఇలా అనుకుంటూ ఒక కాలు క్రింద ఉంచి బ్యాలెన్స్ చేస్తున్నాను. కొద్ది సేపటికి ట్రాఫిక్ క్లియర్ అవుతుండగా నా ఎడమవైపు ఉన్న లారీ చిన్నగా కదిలింది. ఆ కదలికలో లారీకి నా మోచేయి తగిలి నాకు బ్యాలెన్స్ తప్పింది. ఎలాగో తమాయించుకుని ఎడమకాలు దూరంగా జరిపాను. అంతే! ఎవరో ఒక బాగా బలమైన వ్యక్తి స్లిప్పర్ వేసుకొని నా కాలు త్రొక్కుతున్న అనుభూతి కలిగింది. అక్కడికి మనిషి వచ్చే చోటే లేదు. ఆశ్చర్యంతో చూస్తే లారీ వెనుక టైరు నా కాలుపైనుండి వెళ్లింది. అలాగే ఇంటికి వెళ్లాను. అప్పుడు చూసుకుంటే ఒక వేలు చిట్లి రక్తం వస్తుంది. మిగిలిన వ్రేళ్లపై తోలు లేచి ఉంది. తరువాత రోజు ఎవరికి జరిగిన విషయం చెప్పినా వారు నమ్మలేదు. లారీ ఎక్కితే వ్రేళ్లు తీసివేయాల్సిందే అంటూ, నాలాంటి బాధితుడు తన మూడు కాలివ్రేళ్లు తొలగించినది చూపించాడు. నాకు అప్పుడు భయం వేసింది. అయితే ఆ నొప్పి



మూడు నెలలు వరకు ఉంది. నా దినచర్యకు ఎలాంటి ఆటంకం కలుగలేదు. ఆ తరువాత జనవరి ఒకటికి శిరిడీ వెళ్లాను. అప్పుడు ఒకరోజు బాబూజీతో ఒంటరిగా మాట్లాడే అవకాశం వచ్చింది. అప్పుడు పై సంఘటన వారికి చెప్పి ఇలా అడిగాను. "అందరూ వ్రేళ్లు తీసేయాలి అని అన్నారు కదా! మరి నాకు అలా ఎందుకు జరగలేదు. ఒకవేళ మీరుగాని ఆసమయంలో మీ చేతిని అడ్డంగా పెట్టారా" అని అడిగాను. దానికి సమాధానంగా ఒక చిరునవ్వు నవ్వి అమ్మగారిని "అనసూయా! ఇది విన్నావా" అన్నారు. ఆమె వంటింటి నుండి కాఫీ తెస్తూ, "ఏమిటండి" అన్నారు. మనం చిన్నప్పుడు పాఠాలు చదువుకున్నాం కదా భారతంలో భీముడు చిన్నతనంలో తల్లి ఒడిలో పాలు త్రాగుతూ జారి క్రిందపడితే క్రింద ఉన్న బండలు పగిలాయి అని అలాగే మన కొండయ్య కాలిపై లారీ వెళ్లిందంట అన్నారు. అమ్మగారు వెంటనే "అమ్మో! లారీకి ఏమైందండీ అన్నారు" దానితో గురువుగారు పకపకా నవ్వేసారు.

2001వ సం॥లో తిరుపతిలో బాబా విగ్రహ ప్రతిష్ఠకు గురువుగారు తిరుపతి వస్తున్నందున నేను నెల్లూరు నుండి కుటుంబ సమేతంగా తిరుపతి వెళ్లాను. కొన్ని వేలమంది కూర్చొని ఉన్నారు. నేను ఈలోగా మందిరంలో ఒకసారి చూద్దామని మందిర ప్రాంగణంలోనికి వెళ్లి గుడిలోనికి వెళ్లిపోయాను. అచ్చటనే ఆ కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ వున్న నా ఆప్తమిత్రుడు నన్ను కొంచెం కఠినంగానే వారించాడు. "కొండన్నా, ఎక్కడికి వస్తున్నావు ఇక్కడికి రాకూడదు, వెళ్లి దూరంగా ఎక్కడన్నా కూర్చో" అన్నాడు. ఒక్కక్షణం నాకు ఏమీ అర్థం కాలేదు. మిత్రుడు అంత కఠినంగా అందరి గురుబంధువుల ముందు అనేసరికి నాకు కళ్లనీళ్లు తిరిగాయి. నేను వెంటనే బయటకు వెళ్లి రోడ్డుకు అటువైపు ఒక దుకాణం ముందు నిల్చున్నాను. నా భార్య, అందరూ నా ప్రక్కనే నిల్చున్నారు. కాని గురువుగారి చూపులు మాత్రం నా వైపుకు రావడం లేదు. నాకు కొంతదూరం వరకు తలత్రిప్పి చూచి మళ్లీ వెనుకకు వెళుతున్నారు. దానితో నా బాధ మరీ ఎక్కువైంది. "బాబూజీ! ఇప్పటికే నేను బాధలో ఉన్నాను. ఈ సమయంలో మీరుకూడా ఇలా నన్ను నిరాకరించుట భావ్యమా?" అని చాలా బాధపడ్డాను. ఎలాగో బాబూజీ వెళ్లిన తరువాత నెల్లూరు తిరిగి వచ్చేసాను. ఆ బాధ మాత్రం అలాగే వుండిపోయింది. నేను మరల శిరిడీకి వెళ్లి బాబూజీ ఒంటరిగా మాట్లాడే సమయంలో తిరుపతిలో జరిగినది వారికి చెప్పి "నా మిత్రుడు అలా చేసినందుకంటే మీరు నావైపు చూడనందుకు నాకు చాలా బాధగా ఉంది" అని అన్నాను. వారు "అవునా ఆయన అలా ఎందుకు మాట్లాడాడు నేను విచారిస్తాలే" అని అంటూ ఇలా అన్నారు. "నీవు చూడకుంటే ఏమి? నేను నిన్ను చూసాను కదా!" అన్నారు. నాకు వారితో ఉన్న చనువును పురస్కరించుకుని ఇలా అన్నాను. "మీకు ఆ అవకాశం లేదు. ఎందుకంటే మీరు తల నావైపు త్రిప్పితే కదా చూసేందుకు" అన్నాను. "లేదు



నేను నిన్ను చూసాను" అన్నారు. అపుడు నేను "సరే అలాగయితే, నేను ఎక్కడ వున్నానో చెప్పండి చూద్దాం" అన్నాను. వారు నేను బాధపడకూడదని, అలా చెప్పాలని భావించి అడిగాను. వెంటనే వారు నేను నిలుచున్న ప్రదేశం చక్కగా వర్ణించి చెప్పారు. "నువ్వు రోడ్డుకు అవతలివైపు, నీ ప్రక్కనే వున్న స్థంభాన్ని ఆనుకుని నిలుచున్నావు, నీ ప్రక్కన ఫలానావారు వున్నారు. అవునా, కాదా!" అన్నారు. వారు చెప్పిన తరువాత గుర్తుచేసుకుంటే నా ప్రక్కన స్థంభం వుందని అప్పుడు గుర్తుకు వచ్చింది. నేను మరలా వారిని అడిగాను "ఇది ఎలా సాధ్యం" అని. గురుబంధువులు నేను గురువుగారితో అలా మాట్లాడానని కోపించకండి. అప్పుడు వారు నవ్వుతూ ఇలా అన్నారు. **"కొండయ్యా మిమ్ములను చూచేది నా కళ్ళతో కాదు, మనస్సుతో అని"**. అప్పటి నా సంతోషానికి అవధులు లేవు. ***బాబా చెప్పారు కదా "మీరు ఎంత దూరాన వున్నా, ఏమి చేస్తున్నా ఏమి మాట్లాడినా నాకు తెలుస్తుందని", అలాగే గురువుగారికి కూడా మనం ఎక్కడ ఏమి చేస్తున్నా, మాట్లాడుతున్నా తెలుస్తునే ఉంటుంది.*** ఇప్పటికీ ఎంతో మంది గురుబంధువులు గురువుగారి దర్శనానంతరం "ఈరోజు గురువుగారు నావైపు చూడలేదని" కంటతడిపెట్టిన వారిని ఎంతో మందిని చూసాను. ఎందరికో ఈ అనుమానం బలంగా ఉంది. అలాంటి వారికి పై అనుభవం స్వాంతన నిస్తుందని భావిస్తూ...

***– బి. కొండయ్య***

# అనుగ్రహ తత్పరుడు

గురువు అనుగ్రహం చూపడం కోసం సదా 'తత్పరులై' ఉంటారు అనే సూక్తికి ఉదాహరణగా నాకు ఎదురయిన ఈ సంఘటనను గురుబంధువులతో పంచుకునే ప్రయత్నం చేస్తున్నాను. నాపేరు రాణి. నివాసం, ఉక్కునగరం, విశాఖపట్నం. జూన్ 8వ తేదీన విజయవాడ నుండి విశాఖ బయలుదేరి శ్రీకృష్ణా ట్రావెల్స్ స్లీపర్‌లో బయలుదేరాను. రాత్రి 11గం॥లకు విజయవాడలో బస్ ఎక్కాను. నాకు అప్పర్ బెర్త్ దొరికింది. పైకి ఎక్కలేనని క్రింద బెర్త్‌కు మారాను. పగలంతా ఫంక్షను కావడం వలన అలసటతో వెంటనే నిద్ర పట్టింది. కొద్దిసేపటికి పెద్ద పెద్ద శబ్దాలు, ఏమి జరుగుతుందో తెలిసేలోపే ఎగిరి పై సీటుకు కొట్టుకుని క్రిందపడిపోయాను. సీటు క్రింద నా ఎయిర్‌బ్యాగ్, జ్యూస్ బాటిల్ ఉన్నాయి, అవికూడా అదురుకి ముందుకి జరిగాయి. నేను వాటి మీద పడ్డాను. అయితే నా తల బ్యాగ్‌మీద పడింది. ఏం జరుగుతుందో తెలియడం లేదు, మధ్యలో హాహాకారాలు, నేను లేవడానికి కుదరలేదు. ఎలాగో లేచి ముందు చూసాను. డ్రైవరు ముందు అద్దాలు, అన్నీ పగిలిపోయాయి.డ్రైవరు స్టీరింగుకి, సీటుకి మధ్యన ఇరుక్కుని అలానే బస్సును కంట్రోలు చేసే ప్రయత్నం చేస్తున్నాడు. బ్రేకులు అన్నీ డామేజ్ అయి కంట్రోల్ అవడం లేదు. బస్సు అలా వెళ్లిపోయి, రోడ్డు ప్రక్కన టీకొట్టు మీదుగా అలా ముందుకు వెళ్లిపోతోంది. అద్దాలు పగిలిపోవడం వలన అక్కడ ఉన్న పాక యొక్క కర్రలు లోపలికి వచ్చేస్తున్నాయి. లోపలి



వారు ఒకొక్కరూ ఒక్కో సలహా ఇస్తూ అరుస్తూ, ఏడుస్తు అలా రకరకాలుగా గొడవగా ఉంది. నేను మొదటి సీటు నుండి అలా చూస్తున్నాను. నాకు సంబంధం లేనట్లుగా గమనిస్తున్నాను. ఆ పాక యొక్క కర్రలు, రాడ్లు లోపలికి చొచ్చుకు వస్తున్నపుడు మాత్రం క్రింద పడుకున్నాను. ఆఖరుకు బస్సుషెల్టరుకు గుద్ది ఆపగలిగారు డ్రైవరు. అప్పటికే అతనికి బాగా దెబ్బలు తగిలాయి. ఒక టర్నింగ్ వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించడానికి ప్రక్కకు త్రిప్పి డివైడర్‌ను గుద్ది ఎగిరిపడింది. బ్రేకులు ఫెయిల్ కావడం వలన కంట్రోలు చేయలేక అలా జరిగింది. అప్పుడు సమయం రాత్రి పన్నెండు గంటలు దాటింది. చిన్న పల్లె అది. మాది దాదాపుగా చివరి బస్సు. మా అమ్మవాళ్ల కయినా, మావారికయినా ఫోన్ చేద్దామంటే అనవసరంగా కంగారు పెట్టడమే తప్ప అప్పటికప్పుడు వారు చేయగలిగింది ఏమీ లేదు. అందువల్ల మెల్లగా అందరితో క్రిందికి దిగి 108కు ఫోన్ చేసాము. వారు వచ్చి ప్రథమచికిత్స చేసారు. అక్కడి నుండి ఇంటికి వచ్చే ఏర్పాటు కూడా జరిగిపోయింది. "తుమ బిన నహీ ముఝే మా బాప్ భాయీ" అన్న కీర్తనను గుర్తు చేసుకొని, సద్గురువుపై భారం మోపి, హాయిగా విశాఖ చేరుకున్నాను. సమయం ఏదైనా, సందర్భం ఏదైనా, పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నా, సద్గురుకృప మాత్రం చాలు! తన బిడ్డలను ఎట్లాంటి సంకటం నుంచి అయినా సులువుగా నెగ్గుకొచ్చేట్లు చేస్తారు సద్గురుమాయి. **–రాణి, ఉక్కునగరం**

## సద్గురు పదము (పథము)

బీర్బల్ కళ్లు మూసుకుని ఏవో మంత్రాలు చదువుతుండడాన్ని చూసాడు అక్బర్. అవి తనకూ చెప్పించమని అడిగాడు. "రాజా! ఇవి జాగ్రత్తగా ఒక గురువు దగ్గరే నేర్చుకోవాలి" అన్నాడు బీర్బల్. అయితే, అక్బర్ "ధ్యానం చేయడం తెలిసిన వాళ్ల దగ్గర నేర్చుకోలేమా? గురుముఖత నేరుకోవాల్సిన అవసరం ఏమిటి?" అన్న ఉద్దేశ్యంతో, రాజ్యాధికారంతో వేరొకరి దగ్గర నేర్చుకొని బీర్బల్‌కు చెప్పి చూపించాడు అది విన్న బీర్బల్ "పదాలన్నీ అవే రాజా! అయితే వాటిని గురువు వద్ద నేర్చుకున్నప్పుడే దానికి మహిమ" అన్నాడు. "పదాలు మారనపుడు అవి ఎవరు నేర్పిస్తేనేం" విసుక్కున్నాడు అక్బర్. బీర్బల్ చప్పట్లు చరిచి కాపలావాళ్లను పిలిచాడు. "ఈ మూర్ఖుని పట్టుకెళ్లి చెరలో పెట్టండి" అని అక్బర్‌ను చూపించి ఉత్తర్వు ఇచ్చాడు. సిపాయిలు ఆశ్చర్యపోయారు. బీర్బల్ మళ్లీ మళ్లీ అవే ఉత్తర్వులిచ్చాడు. అక్బర్ దగ్గరకు ఎవ్వరూ రాలేదు. బీర్బల్ చర్యకు అక్బర్ కోపంతో "నన్ను చెరలో వేయమనడానికి వీరెవరు? వీరిని ముందు చెరలో పెట్టండి" అన్నాడు. సిపాయిలు వెంటనే ఒక్క ఉదుటున బీర్బల్‌ను పట్టుకున్నారు. అప్పుడు బీర్బల్ నవ్వుతూ "అవే పదాలు నేనన్నప్పుడు ఎవరూ లక్ష్య పెట్టలేదు. కాని మీరు అనగానే వాటికెంత గౌరవం వచ్చిందో చూసారా రాజా!" అన్నాడు. **గురువు దగ్గరే నేర్చుకోవాలన్న బీర్బల్ మాటల్లోని నిజాన్ని గుర్తించాడు అక్బర్.**



# సద్గురువు - సత్సంగం - సంస్కారం

బాబా, గురువుగారి పాదపద్మములకు నమస్కరించి నా ఈ అనుభవాన్ని గురుబంధువులతో పంచుకుంటున్నాను. గురువుగారు నాకు ఈ అవకాశాన్ని కలిగించినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. నేను అందరిలాగే అన్ని దేవుళ్లకు పూజలు చేసేదానిని. అలాగే ఇతర మందిరాలకు వెళ్లేదానిని. అక్కడకు ఒకాయన వచ్చి రామాయణ, భారత, భాగవత, భగవద్గీతల పారాయణం చేసేవారు. ప్రతి రోజూ వెళ్లి వచ్చేదానిని. వచ్చే త్రోవలో మన గురుబంధువు విజయగారి ఇంటిలో ప్రతి లక్ష్మివారం సత్సంగం జరిగేది. ఆరతి ఇచ్చే సమయానికి వస్తూ ఉండేవాళ్లం. విజయగారు, ఇంతకుముందు ఒకసారి చెప్పారు. మా ఇంటిలో ప్రతి లక్ష్మివారం సత్సంగం, భజన జరుగుతుంది రండి అని! కాని మేము వేరే పారాయణ నుంచి వచ్చే సమయానికి ఆరతి జరుగుతుండేది, ఆ సమయానికి వెళితే ప్రసాదానికి వెళ్లినట్లు అవుతుందని భావించేదాన్ని. అప్పుడప్పుడు వెళ్లడం వలన నాకు ఆరతి పాట వచ్చేది కాదు. అక్కడ వున్న ప్రార్ధనాపథం పుస్తకం తీసి పాడేదాన్ని, ఉంటే ఒక పుస్తకం ఇవ్వమని అడిగాను. నాకు ఒక్కటే ఉంది. మీకు పుస్తకం కావాలి అంటే ప్రతి సోమవారం ఉడాకాలనీ ఝాన్సీగారి ఇంటిలో సత్సంగం జరుగుతుంది అక్కడకు వస్తే ఇస్తారు అని చెప్పారు. నాకు ఆ పుస్తకంలో ఉన్న పాటలు, ముఖ్యంగా ఆరతి పాట గురించి అయినా వెళ్లాలి అని అనుకొని సోమవారం రోజున అలాగే సత్సంగానికి వెళ్లేదాన్ని. అప్పటి నుండి గురువుగారికి, సత్సంగానికి దగ్గరయ్యాను.

మాది గాజువాక సత్సంగం. నాకు ఒక బాబు, పాప. పాప బి.కామ్ సెకెండ్ ఇయర్‌లో ఉండగానే క్యాంపస్ సెలక్షన్‌లోనే ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో జాయిన్ అయిన తరువాత పెళ్లి జరిగింది. పెళ్లి అయిన సం॥లోపు పాప పుట్టింది. పాప పుట్టిన ఒకటిన్నర నెల వరకు బాగానే ఉంది. ఆ తరువాత వేయిమందిలో ఏ ఒక్కరికో వచ్చేటటువంటి సమస్య వచ్చింది. అది ఆడపిల్లల విషయంలో ఇంకా తక్కువట. అలాంటి పరిస్థితులలో పైన జరిగినవన్నీ ఏ విధంగా ఆస్వాదించానో, అదేవిధంగా దీనిని కూడా ఆస్వాదించాను. ఇది నా గొప్ప అని నేను అనుకోవడం లేదు. ఇలాంటి మనస్తత్వాన్ని ప్రసాదించిన గురువుగారికి, నా కృతజ్ఞతలు మనస్ఫూర్తిగా తెలుపుకుంటున్నాను. హాస్పటల్‌కి వచ్చిన వాళ్లంతా అయ్యో! ఇంత చిన్నపిల్లకి ఆపరేషనా అని బాధపడి కంటనీరు తెచ్చుకునేవారు. కాని నేను అలా అనుకునేదానిని కాదు. ఎందుకంటే నేను సత్సంగానికి చేరువకావడం వలన. ఒకటిన్నర నెల పాప అవడం, అల్లరి అంతగా లేకపోవడంతో, ఆపరేషను అయిన ఏడవరోజు కుట్లు విప్పినపుడు చూస్తే అసలు ఆపరేషను అయ్యిందా, లేదా అన్నట్లు మాడిపోయాయి. అంత చిన్నతనంలో కనుక అంత త్వరగా తగ్గింది. ఇప్పుడు పాపకు నాలుగవనెల. ఇప్పుడు బోర్లా పడుతుంది, వేసిన దగ్గర ఉండదు.





బాబా, గురువుగారు చిన్న వయసప్పుడే ఆ సమస్యని బయటపెట్టి మాకు, పాపకు బాధ అంటే తెలియని టైంలో నయం చేసి శాంతిని చేకూర్చారు. హాస్పటల్‌లో ఖాళీగా పాపను చూస్తూ ఉండకుండా బాబా నామము మనసులో మననం చేసేదానిని. మనకు కలిగే ఇబ్బందులను మనం కష్టాలు అనుకోకుండా అవి మనలను గురువుకు ఇంకా దగ్గరకు చేరుస్తున్నాయి అని అనుకోవాలి. అలాంటి మనసు గురువే మనకు ప్రసాదించాలి. అదే విధంగా పాపను నిద్రపుచ్చేటపుడు జోల పాటలకు బదులు బాబానామం చెప్తూ ఉంటాను.. పాప ఆరోగ్యంగా ఉంది. అన్ని దేవుళ్లకు పూజలు చేసేటపుడు మంచి జరిగితే ఆనందం. కష్టం వస్తే దుఃఖం కలిగేవి. సత్సంగానికి వెళ్లిన దగ్గర నుంచి గురువుగారు ఏది ప్రసాదించారో అది మన మంచికే అని, కష్టం వచ్చిందని మనసు కలత చెందినా వెంటనే దానిని ఆనందంగానే స్వీకరిస్తున్నాము. ఇదే గురువుగారు ప్రసాదించిన సత్సంగం యొక్క గొప్పతనం.


***– పి. రమణమ్మ, గాజువాక***

## దాసబోధ

సద్గురువును వర్ణించడం ఎలాగో నాకు తోచడం లేదు. మాయకు కూడా తాకడానికి అసాధ్యమైన ఆ గురుస్వరూపం, అజ్ఞానుడనైన నాకెలా అవగతమవుతుంది? సద్గురువు యొక్క పరబ్రహ్మ స్వరూపాన్ని తెలుసుకోవడం అసాధ్యమైనపని. ఎవరిని వర్ణించడానికి శ్రుతులు సైతం నేతి నేతి (ఇదికాదు, ఇది కాదు) అనే యుక్తిని ఆశ్రయిస్తున్నాయో, అట్టి గురుబ్రహ్మ స్వరూపం మూఢునైన నా బుద్ధికి అందుతుదా? అటువంటప్పుడు ఇక ఏమని స్తుతించేది? అందుకని, ఓ గురుదేవా! నీకు దూరంనుండే వందనములు సమర్పించుకుంటున్నాను. నీ మహిమ అనంతమైన సాగరం వంటిది. ఆ మహిమాసాగరపు ఒడ్డును చేరే శక్తిని నీవే దయతో నాకు ప్రసాదించు. నిన్ను స్తుతించాలనే కోరిక ఆపుకోలేకుండావున్నాను. కానీ నా అజ్ఞానం వల్ల నా ధైర్యమంతా పటాపంచలయి పోయింది. ఇంతకుముందు మాయావశుడనై నిన్ను స్తుతించగలనని మురిసాను. కానీ ఇప్పుడు (నా అజ్ఞానాన్ని గుర్తించి) నా అహంభావానికి సిగ్గుపడుతున్నాను. ఇక నా గురువును స్తోత్రము చేసేది ఎట్లాగు? శుద్ధపరమాత్మ తత్త్వాన్ని ఊహించడం, కల్పన చేయడం ఎప్పటికీ సాధ్యం కానిపని. అందుకే ఆ పరమాత్మకు ప్రతిగా ప్రతిమలను చేసి అర్చించవలసి వచ్చింది. అదే విధంగా నేను కూడా మాయాయోగంతో సద్గురు మహిమను అభివర్ణిస్తాను. సాధకుడు తన భావానికి అనుగుణంగా ఏ విధంగా అయితే తన హృదయంలో దైవధ్యానం చేస్తాడో అదే విధంగా ఈ స్తుతి ప్రకరణంలో సద్గురుమూర్తిని స్తుతిస్తాను.

ఓ సద్గురురాజా! జయము! జయము! ఓ విశ్వంభరా! విశ్వబీజమూర్తీ! పరమపురుషా! మోక్షధ్వజా ధీనబాంధవా! సూర్యుని వెలుగుచేత చీకటి పటాపంచలయినట్లు నీ అభయరూపమనే





ప్రకాశం చేత అజేయమైన మాయ అంతా మాయమై పోతున్నది. సూర్యుడు పగటిపూట చీకటిని పారద్రోలుతున్నాడు కానీ, రాత్రి అవడంతోటే ఆ చీకటి మళ్లీ లోకం నిండా అల్లుకుంటున్నది. అయితే, మా సద్గురుస్వామి అటువంటివాడు కాదు. ఆయన జనన మరణాలకు కారణమైన అజ్ఞానమనే అంధకారాన్ని మళ్లీ తలెత్తకుండా మూలమట్టంగా నాశనం చేస్తాడు. బంగారం ఎప్పుడైనా ఇనుముగా మారుతుందా? అలాగే సద్గురు భక్తులు ఎప్పటికీ సందేహాలకు (అజ్ఞానానికి, పతనానికి) లోనవరు. ఏ (ఉప) నదియైనా గంగానదిలో కలసిన తర్వాత అది గంగానదిగానే మారుతుంది. కాని, అది ఒకవేళ గంగానది నుండి వేరుపడితే అది గంగానది మాత్రం ఎప్పటికీ కాదు. గంగా నదిలో కలియడానికి ముందు, ఆ తరువాతా ఆ నదిని జనులందరూ (సామాన్య) 'నది' అనే అంటారు గానీ, గంగ అని ఎప్పుడూ పిలవరు. కానీ శిష్యుని స్థితి అటు వంటిది కాదు. అతడు అన్ని విధాల గురుస్వామిగానే మారిపోతున్నాడు. పరుసవేది సామాన్యలోహాన్ని బంగారంగా మారుస్తుందేమోగానీ, ఇంకొక పరుసవేదిగా మాత్రం మార్చలేదు. పరుసవేది చేత బంగారంగా మార్చబడ్డ లోహమూ ఇతర లోహాలను బంగారంగా చేయలేదు. కానీ, సద్గురు భక్తుడు గురూపదేశం చేత ఇతరులను గూడ సద్గురువులుగా చేయగలుగుతాడు. కనుక సద్గురువును పరుసవేదితో పోల్చడం సరికాదు. పోనీ, సద్గురువును సముద్రంతో పోలుద్దామా అంటే అది కూడా అంత యుక్తియుక్తంగా కనబడడం లేదు. ఎందుకంటే సముద్రమంతా కటిక ఉప్పునీరు. పోనీ పాలసముద్రంతో పోలిస్తేనో, అంటే అది కూడా పొసగడం లేదు. ఎందుకంటే పాలకడలి కూడా కల్పాంతంలో నశిస్తుంది. మహామేరుపర్వతంతో సద్గురుమూర్తిని పోలుద్దామా అంటే, అది కూడా సరిపడడం లేదు. మేరుపర్వతం కఠిన జఢ పాషాణమయం. మరి మా సద్గురుమూర్తి అట్టివాడు కాదే! దీనజనులపట్ల ఆయన దయార్ద్ర హృదయుడు.

ఆకాశాన్ని ఉపమానంగా తీసుకుందామా అంటే, సద్దురు స్వరూపము ఆకాశంకంటే నిర్గుణము. అందుకని ఈ ఉపమానము కూడా సరిపోవడం లేదు. ఒకవేళ ధీరత్వంలో సద్గురువుకు భూమిని ఉపమానంగా చెప్తామా అంటే అదీ సరిపడదు. ఎందుకంటే భూమి కల్పాంతంలో నాశనమవుతుంది. కాదండీ! సూర్యుడే సద్గురువుతో పోల్చదగిన వాడంటారా, సూర్యుని ప్రకాశానికి కూడా నియమము (పరిమితి) ఉన్నట్లు శాస్త్రాలు చెబుతాయి. మరి సద్గురుడో నిర్ణయాతీతుడు. అంతేకాదు! సద్గురువు యొక్క జ్ఞానమనే ప్రకాశం సూర్యుని వెలుగుకంటే గొప్పది. కాబట్టి సూర్యుడు కూడా సద్గురువుతో పోల్చదగినవాడు కాదు. ఒకవేళ ఆదిశేషుని ఉదాహరణగా తీసుకుందామా అంటే, ఆదిశేషుడు ఒక్క భూభారాన్ని మాత్రమే మోసేవాడు. నీటిని ఉపమానంగా తీసుకుందామా అంటే, అదీ కాలాంతరంలో ఎండిపోతుంది. సద్గురుని రూపం నిశ్చలమూ, నిర్వికారము అయినవి. అది ఎన్నటికీ నశింపదు. సద్గురువు అమృతంలాంటి వాడని చెబుతామా అంటే అదీ కుదరదు. ఎందుకంటే అమృతము త్రాగిన అమరులు కూడ





ఒకానొకప్పుడు మృత్యువు పాలవుతున్నారు. **సద్గురుకృప అనే అమృతాన్ని సేవించిన సద్గురు భక్తులే నిజంగా అమరులూ, మృత్యుంజయులూ అవుతారు.**

ఒకవేళ సద్గురువు కల్పవృక్షము వంటి వాడందామా అంటే సద్గురు స్వరూపము కల్పనాతీతము. కాబట్టి ఈ పోకడ కూడా అనుచితము. మనస్సులో కోరిక లేనపుడు చింతామణిని లెక్కచేసేదెవరు? నిష్కాముడైన వానికి కామధేనువుతోనూ పోల్చడం యుక్తం కాదు. సద్గురుమూర్తిని లక్ష్మితో పోల్చడం ఉచితం కాదు. ఎందుకంటే లక్ష్మి ఎప్పటికైనా నశిస్తుంది. మోక్షలక్ష్మిని తన గుమ్మం ముందు బంధించి వుంచగలిగిన సద్గురుమూర్తిని ఈ నాశవంతమైన లక్ష్మితో పోల్చడం తగదు. స్వర్గలోకానికి, దేవేంద్రపదవికి కూడా కాలాంతరంలో చలనం తప్పదు. సద్గురుకృప చలనరహితమైనది కాబట్టి అచంచలమైన సద్గురుకృపను అశాశ్వతమైన స్వర్గంతోను, దేవేంద్ర పదవితోనూ పోల్చడం ఎట్లా? బ్రహ్మ విష్ణు మహేశ్వరులు కూడా కాలాంతరంలో నశిస్తారు. **కానీ సద్గురుపదము శాశ్వతము.** అది ఎప్పటికీ అవినాశి. కాబట్టి, మా దృష్టిలో **సద్గురువుతో పోల్చదగినది సృష్టిలో యేదీ లేదు.** అందుకనే, సద్గురువును వర్ణించడం నాకు చేతకాని పని. అని ముందుగానే విన్నవించుకున్నాను. ఇక చాలును. 'సద్గురువర్ణనము నాకు సాధ్యం కాదు' అని చెప్పటమే నేను చేసే సద్గురువర్ణనము. ***ఆంతర్యంలో అచలంగా వుండే ('నేను' అనే)ఎఱుకను అంతర్నిష్ఠుడై అపరోక్షానుభూతినొందిన వాడికే ఆ సద్గురు స్వరూపం ఎఱుక.*** **- శ్రీ సమర్థ రామదాస స్వామి**

## క(వ)లల కాచిన కరుణ

గురువుగారికి నమస్కరిస్తూ, నేను 2006 గురుపూర్ణిమకు శిరిడీ వెళ్లాను. గురుదేవుల దర్శనమయ్యింది. ఆ రోజు రాత్రి బాబా కలలో కనిపించి మా చిన్నఅమ్మాయి వివాహం గురించి నాకు వివరంగా చెప్పారు. 2007 ఫిబ్రవరిలో తన వివాహం చక్కగా జరిగింది. నాకు సాయిబాబా, బాబూజీలంటే చాలా ఇష్టం. వారు మా అవసరాలన్నీ చూసుకుంటున్నారు. 2008లో మా అమ్మాయి పురిటికి ఇంటికి వచ్చింది. తనకు బ్లడ్‌ప్రెషర్, షుగరు రెండు చాలా ఎక్కువగా ఉన్నాయని తేల్చారు డాక్టర్లు. ఎనిమిదవనెలలోనే పురిటినొప్పులు వచ్చాయి. ఆసుపత్రికి తీసుకువెళ్తే తల్లీ,బిడ్డకు ప్రమాదమన్నారు. హైదరాబాద్ తీసుకువెళితే మంచిదని చెప్పారు. కానీ సమయం తక్కువ ఉండడంతో బాబా, బాబూజీలపై భారం వేసి అక్కడ డాక్టరుగారిని ఆపరేషన్ చేయమని చెప్పాము. అందరికీ చాలా భయం వేసింది. భీమవరంలో మా (గురు)బంధువులు కూడా బాబా నామం చెప్పుకున్నారు, మా అమ్మాయి గురించి. నాకు ధైర్యం చెప్పారు. విచిత్రమేమంటే ఆపరేషన్ థియేటర్‌లోనికి వెళ్లిన తరువాత బి.పి., షుగర్ రెండూ నార్మల్‌కు వచ్చేసాయట. అంతకుముందు మూడు బాటిళ్ల రక్తం అవసరం అవ్వొచ్చు అన్న డాక్టర్ రక్తం అవసరం లేదని





చెప్పారు. నిజానికి, మా పాప రక్తం గ్రూప్ కూడా చాలా అరుదుగా దొరికేది. నోటమాట రాలేదు. గురుదేవుల కరుణ చూసి, క్షణక్షణం ఆయన చూసుకున్న తీరు చూసి సాయికి నమస్కరించుకుంటున్నాను. కవలలు పుట్టారు. ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. డాక్టర్లు అన్నారు "ఇదంతా మిరకిల్(అద్భుతం)గా ఉంది". ***గురువుని నమ్ముకుంటే చింతలేదు, ఎప్పుడైనా మనకు అలా అనిపించినా గురు'చింతన' చేసుకుంటే ఇక నిశ్చింతే!*** **– విమల, బెల్లంపల్లి**

## అడిగితే చాలు - జరిగేను మేలు

పూజ్య బాబా, బాబూజీలకు నా హృదయపూర్వక నమస్కారములు. నాపేరు మల్లీశ్వరి. ఏలూరు సి.ఆర్.ఆర్. కాలేజీలో బి.టెక్ చివరి సంవత్సరం చదువుతున్నాను. అంశాలు చిన్నవే అయినా గురువుగారు నన్ను అనుగ్రహించిన తీరు ఆనందంగా ఉండడంతో మీతో ఈ అనుభవం పంచుకుంటున్నాను. నాకు ముగ్గురు సోదరులు. అన్నయ్య ఒక్కడికి వివాహం అయింది. ఒక బాబు. వాడికి ఏడునెలలు. ఒక సీజన్‌లో మా పల్లెటూళ్ళో అందరికీ జ్వరాలు ఉన్నాయి. ఏలూరులో ఉన్న నాకు కూడా మలేరియా రావడంతో మా ఊరు వెళ్లాను. నేను మా ఊరు రావడం, అందరికీ బాగోక పోవడంతో వాళ్ల అమ్మగారి ఇంటిదగ్గర ఉన్న మా వదిన బాబును తీసుకుని మా ఊరు వచ్చింది. మేము వద్దని వారించినా వినలేదు. ఏడు నెలల క్రితం మా వదినకు సిజేరియన్ ఆపరేషన్ చేసి బాబును బయటకు తీసారు. డాక్టర్లు 2-3 సం॥ల వరకు ఇంకొక బిడ్డకు అవకాశం ఇవ్వద్దని చెప్పి పంపారు హాస్పిటల్ నుంచి. కానీ, మా వదిన మా ఊరు వచ్చేసరికి ఇంకొకసారి ప్రెగ్నెంట్ అయ్యానేమోనని భయంగా ఉందని చెప్పింది. ఇదిలా ఉంటే నాలుగు రోజులు మా ఊళ్లో ఉండి వాళ్ల అమ్మగారి ఊరు వెళ్లగానే తనకు చికున్‌గున్యా అన్నారు డాక్టర్లు. నాకు చాలా భయం వేసింది. మా వదిన ఈ విషయాలన్నీ ఎలా తట్టుకుంటుందా అని బాబా, గురువుగార్లకు చెప్పుకుంటూ ఉన్నాను, ఈ ఇబ్బందుల నుంచి మా వదినను గట్టెక్కించమని. గురుదేవుల దయవల్ల తనకు వారం రోజుల్లో జ్వరం, నొప్పులు రెండూ తగ్గాయి. అంతేకాదు, తను ప్రెగ్నెంట్ కూడా కాదని తెలిసింది. కృతజ్ఞతలు శ్రీ బాబూజీకి. **– మల్లీశ్వరి, ఏలూరు**

---

సద్గురువు యొక్క పని ఏమిటంటే మనం క్రింద ఉన్నాము, క్రింది నుంచి చేయి పట్టుకొని మనలను పైకి తీసుకు వెళ్ళాలి! ఆయన పైన కూర్చొని పైకిరా అనటం కాదు. పైకి రాగలిగితే ఇంకేముంది? మనల్ని ఆయన తీసుకుపోయేదేముంది? దీన్ని యోగి వేమన చక్కగా చెప్పాడు ఒక పద్యములో ......**"ఇహము లేదు పరముగలదు అన్నవాడి మాట కల్ల మాట. ఇహములోనే పరము చూపువాడె సద్గురువు॥"** మనం ఇహంలోనే ఉన్నాము. ఇక్కడికి, ఆ సద్గతి, ముక్తో, మోక్షమో మనకు అందించేవాడే సద్గురువు. – *శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ*





# అనుగ్రహమంటే?...అనుగ్రహముంటే?..

ధర్మానికి గ్లాని కలిగినపుడు మహాత్ములు ఉదయిస్తారు. అలా జగత్తు భగవత్ చింతనను మరుస్తున్న రోజుల్లో శంకరాచార్యులవారు మానవుని మనస్సును భగవత్ తత్త్వం నడిపించడానికి నడుం బిగించారు. ఆ పరిణామదశలో వారు యాత్రచేస్తున్న సమయంలో శృంగేరి ప్రాంతానికి చేరి అక్కడ ప్రవహిస్తున్న తుంగానదిని చూడగానే ఒక భావోద్వేగానికి లోనయ్యి, తుంగ ఒడ్డున కూర్చున్నారు. నెమ్మదిగా, ఒక శ్రావ్యమైన కీర్తనలాగా, ఎలాంటి అలజడి లేకుండా ప్రవహిస్తున్న నదిని చూసి "ఆహా! మనసు ఇలా కదా ఉండవలసినది " అని శాస్త్రాధ్యయనం అయినా బోధ అయినా అందుకు ఇది అనువైన ప్రదేశమని అక్కడ స్థిరపడ్డారు. భ్రమరము (పువ్వు) ఉండాలే కాని కీటకాలకేమి లోటన్నట్లు శంకరుల బోధకై చేరారు శిష్యులు. నిత్యము ఎవరికి ఏది కావాలో వారికది వేదము, పురాణము, ఇతిహాసము, తర్కము, మీమాంస... ఇలా కావాల్సినంత మధువును (జ్ఞానాన్ని) గ్రోలుతున్నారు శిష్యులు.

ఒకరోజు అధ్యయనం జరుగుతున్న రోజున ఒక యువకుడు వచ్చి శంకరుల ముందు నిలబడ్డాడు. చేతులు జోడించి "అయ్యా! మాది ఈ ఊరే! నాకు చదువు, డబ్బు లేదు. ప్రపంచమంటే ఏమిటో, జ్ఞానం అంటే ఏమో నాకు తెలియదు. మీ దర్శనాన్ని నాలుగురోజులు నుంచి చేసుకుంటున్నాను. మీ శిష్యులను చూసాక, మీ మాటలు విన్నాక మీ దగ్గరే ఉందామని అనుకున్నాను. నాకు విద్యాధికాలు తెలియవు, కనుక మీసేవ చేసుకునే భాగ్యాన్ని నాకు కల్గించండి" అని వేడుకున్నాడు. స్వచ్ఛమైన అతని మనసును, స్పష్టంగా ఉన్న అతని ఆలోచనను చూశారు శంకరులు. ఒక్క మాట అడిగారు "నీ పేరేమిటి?" వారికి తెలియదన్నట్లు. నాపేరు "ఆనందగిరి". "సరే! ఉండిపో" అని అనుజ్ఞనిచ్చారు, అభయమిచ్చారు. శంకరులు లేవకముందే లేవడం, వారి వస్తువులన్నీ శుభ్రం చేయడం, వారి దైనందిన కార్యక్రమాలకు అన్నీ సిద్ధం చేయడం, వారి వస్త్రాలను తుంగానదికి తీసుకువెళ్లి, శుభ్రం చేసి ఆరబెట్టి సాయంత్రం తీసుకురావడం, ఇలా వారికి ఏ పనీ అవసరమయితే ఆ పని. ఇది 'ఆనందగిరి' నిత్య కార్యక్రమం. "నేను సేవ చేసుకుంటున్నది ఒక ఉన్నతుడైన గురువుకు – ఇక నాకు ఏ జ్ఞానం కావాలని" అనుకున్నాను.

రోజులు గడిచాయి, 'కొన్ని' రోజులు 'అన్ని' రోజుల్లా ఉండవు. శంకరులు ఒక సాయంవేళ శిష్య పరివేష్ఠితులై ప్రవచనానికి ఉపక్రమించారు. శిష్యులంతా వారి ప్రవచనానికై వేచి చూస్తున్నారు. శంకరులు మౌనముద్రలో చాలా సమయం ఉండిపోయారు. కాలాతీతమవుతున్నదని ఒక శిష్యుడు లేచి, గురుదేవా! సమయం అవుతున్నది, కావున మిమ్ములను వేడుకుంటున్నాం మీ అనుగ్రహ పూర్వక వచనాలకై ఎదురుచూస్తున్నాం. భగవత్పాదులు ఇలా అన్నారు ఒక భావావేశంతో – "ఆనందగిరి ఎక్కడ?" జ్ఞానార్జన చేస్తున్న మమ్మల్ని వదిలి పరిచారకుడైన ఆనందగిరి గురించి అడుగుతారేమి? అని



ఆలోచనలో పడ్డాడు ప్రశ్న అడిగిన శిష్యుడు. అక్కడి శిష్యుల ఆలోచనలను గ్రహించిన శంకరులు ఒక క్షణం ఆగి ప్రవచనం ప్రారంభించారు. ఇదే సమయంలో తుంగ ఒడ్డున బట్టలు ఉతుకుతున్న ఆనందగిరి శరీరంలో ఒక్కసారి ఒకరకమైన భావతీవ్రత జనించింది. ఆనందగిరికి అంతులేని ఆనందం అనుభవమయ్యింది. ఉతుకుతున్న బట్టలు చేతుల్లోనే ఉన్నాయి. అలాగే శంకరుల వద్దకు పరుగున వచ్చాడు. కొన్ని నిమిషాల తరువాత ప్రవచనం ఆగిపోయింది. శంకరుల దృష్టి ఆనందగిరిపై పడింది. ఆనందగిరి ఒక ఆశువుగా తోటక వృత్తంలో (ఒక వ్యాకరణ సంప్రదాయం) శంకరులను కీర్తించాడు. "మీ అనుగ్రహం పొందడానికి మాకు కాస్తంత అర్హత కావాలి గాని, మీ అనుగ్రహంలో లోటెక్కడుంది గురుదేవా? మిమ్ములను గ్రహించాలన్నా, మీ అనుగ్రహం పొందాలన్నా ఈ శాస్త్రాలతో నాకేమి పని. మీరే నావాడు అయినపుడు ఈ శాస్త్రాలు నా వెంట పరిగెత్తుకుని రావా? ***తర్క, మీమాంస, శాస్త్రములన్నీ నేనెరిగినా, నా కళ్ల ఎదుట ఉన్న దైవమైన మిమ్ములను గ్రహించని రోజు ఈ శాస్త్రాలన్నీ ఎండుపుల్లలే కదా!"*** అంటూ కీర్తించాడు. తోటక వృత్తంలో కీర్తించాడు కనుక తోటకాచార్యుడై ప్రసిద్ధిగాంచాడు. సద్గురుభక్తిపథంలో మనకు సద్గురువంటే ఏమిటో చెపుతూ, ఆచార్యుడయ్యాడు. మట్టిముద్దలా ఉండటమే మనపని. ప్రతిమగా చేయడం, ప్రాణం పోయడం, భాష నేర్పడం, బాటను చూపడం, గమ్యం చేర్చడం, ఇదంతా భువికి దిగి వచ్చిన దైవం.... గురువు పని అని గ్రహిస్తే చాలు. అందుకే ***సాయి అన్నారు గురువుకు పగ్గాలప్పగించమని.***

***– గురుకృప***

**"నేనేమి చేస్తున్నానో నీవు చూడటం మొదలుపెడితే, నీవు ఎందుకు వచ్చావో అది మరచి పోతావు. నా గురుదేవులు ఏమి చేస్తున్నారో నేనెప్పుడూ చూడలేదు. వారు ఏది చెప్పారో అది చేశాను. అందుకే వారు ఏమి పొందారో అది పొందగలిగాను. నీవు, నేనేమి చేస్తున్నానో చూడడం మానేసి నేనేమి చెప్పానో అది చేస్తే, నా గురువు వల్ల నేను ఏమి పొందగలిగానో అది నీవు పొందగలవు. అనుగ్రహమనేది తీసి ఇచ్చే వస్తువు కాదురా, అది గురువును మెప్పించి పొందవలసినది. జ్యోతిని వెదుకుతూ వచ్చి జ్యోతిని చూడడం మరచి, జ్యోతి చుట్టూ క్రిందపడే నీడను చూడడము మొదలుపెడితే, ఆ నీడలో నీవు కూడా ఒక నీడగా కలసి పోతావు ఆలోచించుకో, నిర్ణయము నీ యిష్టము"**

***– మహద్గురు స్వామి శ్రీ పూర్ణానంద***


సాయి సమగ్రదర్శిని : **www.saibaba.com**

సద్గురు తత్త్వ దర్శిని : **www.gurukrupa.info**

గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన mail ID : **gurukrupa@saimail.com**




"దర్శనం వలన కలిగే అనుభూతి చాలు!
జీవితం ధన్యం కావడానికి"


దర్శించేది సాయిరూపం
ప్రభవించేది సాయితత్వం
వినిపించేది సాయినామం
ఎటువిన్నా, ఎటుకన్నా సాయి... సాయి...
మమ్ములను కాచేది ఈ సద్గురుమాయి